ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 28 జనవరి 2025



రేషన్ షాపులో పురుగుపట్టిన జొన్నలు
- నాసిరకం సరఫరాపై లబ్ధిదారుల ఆగ్రహం

వివరాలు.. 8లో..





యూరియా.. మాఫియా..!



- అన్నదాతకు అందని యూరియా ● రూ.267తో కొనుగోలు.. రూ.3 వేలకు అమ్మకం
- ప్లైవుడ్ పరిశ్రమలు, పశువులు, కోళ్ల దాణా, పాల కల్తీలో యథేచ్ఛగా వాడకం
- నకిలీ ఆధార్ కార్డులతో కాజేస్తున్న ముఠా ● పట్టించుకోని అధికారులు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పంట ఏదైనా పోషకాలతో పైర్లు బాగా ఎదిగేందుకు యూరి యా తప్పని సరి ఇలా ప్రతి అన్న దాత సాగుచేసే పంటకు యూరి యాతోపాటు మిశ్ర మమైన ఎరువులు ఉపయోగిస్తారు. గతంలో యూరియా కుంభకోణం జాతీయస్థాయిలో సంచలనమైన విషయం తెలిసిందే. యూరియా అంటేనే వ్యాపార వర్గాలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడనుంది. దశాబ్దాలుగా యూరియా మాఫియాకు చెక్ పెట్టేందుకు వేప మిశ్రమంతో అందుబాటులోకి తెచ్చింది. ప్రారంభంలో కొంతకాలం వ్యాపారులకు చెక్ పెట్టినట్లయ్యింది. ఆ తర్వాత యూరియాను వదులుకోలేని పరిస్థితుల్లోకి వచ్చారు. ఇలా యూరియాను పొందేందుకు ఎన్ని అక్రమమార్గాలకైనా వెనుకాడడం లేదు. రాష్ట్రంలో యూరియా మాఫియా తీవ్రమైన పరిణామాలు చూపుతోంది. అన్నదాతకు మేలు చేయాలని ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. పంటలసాగుకు వర్షాలు లేదా నీటి ఆధారం ఎంత అవసరమో, రసాయన ఎరువులు కూడా అంతే కీలకం. అన్నదాతకు ఆర్థిక భారం తగ్గించేలా మట్టి సారవంతంలో పోషకాల సమస్య తీవ్రరూపం దాల్చరాదనే యూరియాతోపాటు అన్ని రసాయన ఎరువులకు సబ్సిడీ అందిస్తోంది. కేంద్రప్రభుత్వం యూరియాను పోషకాంశాల ఆధారితంగా ఎరువులను తయారు చేయిస్తున్నారు. వేప లేపన మిశ్రమం కల్గిన యూరియా కేజీ రూ.45గా ఉంది. ఒక బస్తా 1666గా ఉంది. అయితే రైతులకు రాయితీ పద్ధతిన ఒక బస్తా యూరియాను రూ.267 చొప్పున అందిస్తారు. మిగిలిన రూ.1,399 మొత్తం కేంద్రప్రభుత్వమే భరిస్తోంది. యూరియా మాఫియాకు నేచర్ బేస్ట్ సొల్యూషన్స్ (ఎన్‌బీఎస్) అనేది డబ్బు చేసుకునే దందాగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్సిడీతో కొనుగోలు చేసే యూరియాను పంటలసాగుకు మినహా మిగిలిన ఏ విధమైన వాటికి వాడరాదు. అయితే ఇటీవల కొన్నేళ్లుగా యూరియా వ్యవసాయం కంటే పరిశ్రమలకు ఎక్కువగా వాడుతున్నారు. ప్లైవుడ్, బంక, జౌళి, పశువుల, కోళ్ల దాణా తయారీ విభాగాలకు యూరియాను ముడిపదార్థంగా వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

వ్యవసాయేతరంగా వాడకం


యూరియాను కరిగించి ప్లైవుడ్ పరిశ్రమల్లో బంకగా ఉపయోగిస్తారు. పశువులు, కోళ్ల దాణాలో ప్రొటీన్‌కు బదులుగా యూరియాను వాడుతారు. పాలల్లో కలుషితం కోసం కూడా యూరియాతోపాటు పలు రసాయనాలు వాడడం పరిపాటిగా మారింది. సిగరెట్‌లలో పరిమళం పెంచేందుకు యూరియా మిశ్రమం వాడుతారు. ఎయిర్ కండీషనర్, బాత్రూం క్లీనర్ లోషన్లలోనూ వినియోగిస్తారు. రాగి, వరిగడ్డికి ఒకశాతం యూరియాను నీటిలో కలిపి గడ్డిని ప్లాస్టిక్ సంచుల్లో భద్ర పరుస్తారు.

డిమాండే పెట్టుబడి...

ఎరువుల దుకాణాలు, మల్బరీ రైతులు, రైతు సేవా సహకార సంఘాలు యూరియా డిమాండ్‌ను పెట్టుబడిగా మార్చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు దళారుల ద్వారా తమిళనాడు, కేరళతోపాటు పలు రాష్ట్రాల పరిశ్రమలకు యూరియాను ఎగుమతి చేస్తారు. రైతుల పేరిట ఆధార్ కార్డులను అందించి యూరియాను కొనుగోలు చేస్తారు. ఒక సంచి యూరియాను రూ.267కు కొనుగోలు చేసి మార్కెట్‌లో రూ.2,500 నుంచి రూ.3 వేల దాకా విక్రయిస్తారు. నేపాల్, బంగ్లాదేశ్‌లతోపాటు పలు విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎరువుల దుకాణాల యజమానులు రైతుల పేరిట నకిలీ ఆధార్‌కార్డు, కిసాన్ కార్డుల ద్వారా యూరియాను దళారుల ద్వారా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వ్యవసాయశాఖ పలు ప్రాంతాల్లో దాడులు చేసి 712 మెట్రిక్ టన్నుల యూరియాను స్వాధీనం చేసుకుని 42 కేసులు నమోదు చేశారు. మండ్య, మైసూరు, చామరాజనగర్, హాసన్, తుమకూరు, శివమొగ్గ, దావణగెరె, చిక్కమగళూరుతోపాటు పలు దక్షిణ జిల్లాల నుంచే ఎక్కువ యూరియా పరిశ్రమలకు చేరుతున్నట్లు తెలుస్తోంది. సంచి యూరియాకు రూ.2వేలకుపైగా ఆదాయం వస్తుండడంతో మాఫియా ఎంతటికైనా వెనుకాడకుండా అక్రమాలకు పాల్పడుతోంది. రాష్ట్రంలో సబ్సిడీ యూరియాను అక్రమంగా పరిశ్రమలకు తరలిస్తే హెల్ప్‌లైన్ 1800 4253553కు సమాచారం ఇవ్వాలని వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ కేజీ అనూప్ ఒక ప్రకటనలో తెలిపారు.

బొ(బా)మ్మకు.. గౌరవం..!





- తోలుబొమ్మల కళాకారిణి భీమవ్వకు 'పద్మశ్రీ 'పురస్కారంపై సర్వత్రా హర్షం
- వందేళ్ల వయసులోనూ అదే ఉత్సాహం ● అమెరికా, ప్యారిస్, ఇటలీ, ఇరాన్, స్విట్జర్లాండ్ దేశాల్లో ప్రదర్శనలు ● రాష్ట్రానికి గర్వకారణం: కళా సంఘాలు

తోలుబొమ్మలాట ప్రదర్శనలో పద్మశ్రీ పురస్కార గ్రహీత భీమవ్వ దొడ్డబాలప్ప (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచి జానపద కళల్లో ఒకటైన తోలుబొమ్మలాటకు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రానికి చెందిన ప్రముఖ తోలుబొమ్మల కళాకారిణి భీమవ్వ దొడ్డబల్లప్ప శిల్లేశ్యతకు పద్మశ్రీ పురస్కారం దక్కడంపై పలు రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక యుగంలోనూ అంతరించిపోతున్న జానపద కళలకు ఈమె ప్రాణం పోసిందని అభినందిస్తున్నారు. సుమారు తొమ్మిది దశాబ్దాలుగా మనచుట్టూ ఉన్న భీమవ్వ దొడ్డబాలప్పకు పద్మశ్రీ లభించడంతో సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. దేశంలో ఎన్నో విభిన్న సంస్కృతి, సాంప్రదాయాలు, విభిన్న కళలు, కళాకారులు ఉన్న దేశంలో కన్నడనాడులో వెలసిన పురాతన తోలుబొమ్మలాటకు కేంద్ర ప్రభుత్వం అరుదైన గౌరవం ఇవ్వడంతో అరుదైన కళల జాబితాలో తోలుబొమ్మలాట చేరినట్లు అయింది. ఆదివారం కొప్పళ జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి , కలెక్టర్ నళినీ అతుల్ పద్మశ్రీ పురస్కారం అందజేశారు. అనంతరం ఘనంగా సత్కరించారు.



భీమవ్వకు పద్మశ్రీ పురస్కారం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ నళినీ అతుల్

దొడ్డబాలప్పతో భీమవ్వ వివాహం


అప్పటికే తోలుబొమ్మలాట ప్రదర్శనలో నైపుణ్యం ఉన్న భీమవ్వకు కొప్పళ నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో మొరనాల గ్రామానికి చెందిన్న అప్పటికే తోలుబొమ్మలాటలో ప్రసిద్ధి చెందిన దొడ్డబా లప్పను వివాహం చేసుకుంది. ఇద్దరి కళాభివృద్ధి ఒకటే కావడంలో భర్త భర్తతో కలిసి తోలుబొమ్మ లాట కళపై మరింత మక్కువ పెంచుకుని ప్రదర్శనలో తనదైన పాత్రను సంపాదించుకుంది.

కొప్పళ తాలూకా మొరనాళ గ్రామంలో జన్మించిన అమ్మమ్మకు ప్రభుత్వ లెక్కల ప్రకారం 102 నుంచి 103 ఏళ్ల వయస్సు ఉండవచ్చు. భీమవ్వ సాధనకు మెచ్చి 1993లో తెహ్రాన్ బొంబె ఉత్సవం ప్రశస్తి, 63వ అఖిల భారత కన్నడ సాహిత్యసమ్మేళనంలో ప్రాదేశిక రంగ కళ అధ్యయనం, 2005-06లో జానపద బయలాట అకాడమీ అవార్డు, 2022లో సీనియర్ నాగరిక అవార్డులతో పాటు ఎన్నో సంఘ సంస్థల ద్వారా తోలుబొమ్మల కళాకారిణి లెక్కనేనన్ని పురస్కారాలు అందుకోవడం విశేషం. భీమవ్వ వందసంవత్సరాల క్రితం తోలుబొమ్మలను సంరక్షిస్తూ వస్తున్నారు. రామాయణ, మహాభారతం గురించి ప్రసంగాలను భీమవ్వ గుర్తుంచుకుని నేటికీ పాడడం, తోలుబొమ్మల లయకు అనుగుణంగా పాటలను రూపొందించడం, పౌరాణిక కథలను వల్లించడంలో భీమవ్వకు అపారమైన అనుభవం ఉంది. తోలుబొమ్మల కళాకారిణికి తమ జిల్లాలో ఉండడం, భారతీయ అత్యంత పురస్కారాల్లో భీమవ్వకు పద్మశ్రీ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి హర్షం వ్యక్తం చేశారు. భీమవ్వ తోలుబొమ్మలాట జానపద కళను కాపాడుకోవడంతో పాటు తన కుటుంబం ద్వారా కూడా కళను నేటి తరం వరకు పోషిస్తూ వస్తోంది. భీమవ్వది కూడా పెద్ద జానపద కళలు కలిగిన కుటుంబంగా చెప్పుకోవచ్చు. భీమవ్వ కుమారుడు కేశప్ప శిళ్ళిక్యాతర అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన తోలుబొమ్మలాట కళాకారుడు. ఆయన 2023 సంవత్సరంలో రాజ్యోత్సవంలో అవార్డు అందుకున్నారు. భీమవ్వకు పద్మశ్రీ అవార్డు లభించడం పట్ల కొప్పళ జిల్లా కళాభిమానులు, రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు భీమవ్వకు అభినందనలు తెలియజేస్తున్నారు.

భీమవ్వ జానపద కళా నేపథ్యం

కొప్పళ జిల్లా ఇరకల్లుగడాద హనుమట్టి సంజీవప్ప కుమార్తె అయిన భీమవ్వ కొప్పళ తాలూకా మొరనాళ గ్రామంలో 1929న జన్మించింది. తన 14వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు తోలుబొమ్మలాట కుల వృత్తిగా చేసుకుని జీవిస్తోంది. భీమవ్వ దొడల్లబల్లప్ప నిరక్షరాసులు కావడంతో వారి కుటుంబం నుంచి వారసత్వంగా వచ్చిన జానపద కళనే పెంచి పోషిస్తోంది. ఆధునిక యుగంలో గ్రామీణ క్రీడలు మాయమవుతున్న తరుణంలోనూ తన ఆటలతో పురాతన కళకు జీవం పోసింది. భీమవ్వ కుటుంబం రెండు మూడు తరాల నుంచి ఇదే కళను వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఇదే కళలో మహత్తరమైన సాధన చేయడంతో పాటు కన్నడనాడు తోలుబొమ్మలాట కళను అమెరికా, ప్యారిస్, ఇటలీ, ఇరాన్, ఇరాక్, స్విడ్జర్‌ల్యాండ్, హాలెండ్ లాంటి ఎన్నో ప్రముఖ దేశాల్లో రామాయణ, మహాభారతం లాంటి మహాకావ్యాలు, పస్తుతం వర్తమాన ఘట్టాలను తోలుబొమ్మలాట ద్వారా ప్రదర్శించి దేశ, కళ, సంస్కృతి వారసత్వాన్ని నెలబెట్టడంలో విజయం సాధించింది. చిన్ననాటి నుంచి ఈ కళలో లీనమైన భీమవ్వ విదేశాల్లో సైతం ఈ కళను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. తన కుటుంబంతో కళను కాపాడుకోవడంలో విజయం సాధించింది.

అవ్వకు దక్కిన అవార్డులు..



పగుళ్లు ఏర్పడిన విజయ విఠల దేవస్థానం తూర్పు గోపురం

గోపురం వద్దకు నో ఎంట్రీ..!

- హంపి విజయ విఠల దేవస్థానం గోపురంలో పగుళ్లు
- పర్యాటకుల సందర్శనపై నిషేధం

బళ్లారి గాంధీనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపిలోని విజయ విఠల దేవస్థానం తూర్పు దిక్కున గోపురంలో పగుళ్ళు ఏర్పడ్డాయి. ముందు జాగ్రత్త చర్యగా గోపురం చుట్టు ప్రక్కల పర్యాటకులు ఎవరూ రాకుండా నిషేధం విధించారు. ఇటుకలు, గారతో నిర్మించిన ఈ గోపురం పై భాగంలో ఉన్న గార, ఇటుకల మధ్య బీటలు వారడంతో వాటికి మరమ్మతులు చేపట్టారు. గతంలో కూడా ఈ గోపురంలో బీటలు వాటినట్లు, ఆ ప్రాంతంలో గాజుప్లేట్లు అంటించి పరిశీలన కోసం ఉంచినట్లు భారతీయ పురాతత్వ శాఖ ఏఎస్‌ఐ అధికారులు తెలిపారు. విజయ విఠల దేవస్థానం గోపురం ద్వారా వెళ్ళి లోపుల ఉన్న రాతి రథం, సంగీత మంటపాలు స్మారకాలు వీక్షించవచ్చని అధికారులు తెలిపారు.

నటుడు శివరాజ్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొంది కోలుకుని వెనుదిరిగి వచ్చిన హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్‌ను సీఎం సిద్ధరామయ్య పరామర్శించారు. సోమవారం ఉదయం నాగవారలోని నటుడు శివరాజ్‌కుమార్ ఇంటికి వెళ్లిన సీఎం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అమెరికాలో ఆపరేషన్ జరిగిన మరునటిరోజే ముఖ్యమంత్రి ఫోన్ చేసి పరామర్శించిన సంగతి తెలిసిందే. ఆదివారం బెంగళూరుకు చేరుకున్న శివరాజ్‌కుమార్‌ను పరామర్శించిన సీఎం ప్రస్తుతం ఎలా ఉందని ఆరా తీశారు. ఆయన వెంట మంత్రి బైరతి సురేశ్ తదితరులు ఉన్నారు.



శివరాజ్‌ను పరామర్శిస్తున్న సీఎం సిద్ధరామయ్య

మార్చి నుంచి రాష్ట్ర పర్యటన

- జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కోసం రంగంలోకి దిగుతానని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ తెలిపారు. పార్టీ కార్యాలయం జేపీ భవన్‌లో సోమవారం దేవేగౌడ మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ సమావేశాల తర్వాత హాసన్‌కు వెళ్తానన్నారు. మూడు వారాలపాటు అక్కడే గడిపి పార్టీ కార్యకర్తలు, నాయకులందరితో చర్చలు జరుపుతానన్నారు. పార్టీని భవిష్యత్తులో ఎలా అభివృద్ధి చేయాలనేది తీర్మానిస్తానన్నారు. కుమారస్వామి కేంద్రమంత్రిగా దేశమంతటా పర్యటిస్తున్నారన్నారు. నిఖిల్ సీనియర్‌నేతలు, యువ కార్యకర్తలతో కలసి సమన్వయం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి శక్తిని తీసుకురావడమే ఆశయమన్నారు. జిల్లా, తాలూకా, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. చన్నపట్టణలో నిఖిల్ ఓటమిపై పరిశీలించుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నుంచి స్వయం గా నేనే రంగంలోకి దిగి ప్రాంతాలవారీగా పర్యటిస్తానన్నారు.



ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజాజీనగర్ రాజ్‌కుమార్ రోడ్డులోని ఒక ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. 30కిపైగా వివిధ ద్విచక్రవాహనాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. అప్పటికే భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నష్టం వివరాలు తెలియరాలేదు.



షోరూంలో చెలరేగుతున్న మంటలు



కాలిపోయిన బైక్‌లు

కోర్ కమిటీ నిర్ణయిస్తే అధ్యక్ష బరిలోకి..

- ఎమ్మెల్యే బసనగౌడ యత్నాళ్



బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కోర్ కమిటీ నిర్ణయిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షస్థానానికి పోటీ చేస్తానని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ప్రకటించారు. విజయపురలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్ కమిటీలో తన పేరు ఖరారు చేస్తే పోటీకి వెనుకాడేది లేదన్నారు. గెలుపు నిశ్చయమన్నారు. ఇన్‌చార్జ్‌ల సభకు తాను వెళ్లనని, అక్కడ 600మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అక్కడ తనకేం పని అన్నారు. విజయేంద్రకు 600మంది ఎమ్మెల్యేలు, 1500మంది ఎంపీలు, 2వేలమంది ఎమ్మెల్సీ మద్దతు ఉందని ఎద్దేవా చేశారు. జార్కిహోళి వెంట ఎవరున్నారని అందుకే తాము వెళ్లమన్నారు. రాత్రి డీకే శివకుమార్ ఇంటికి, ఉదయం సీఎం ఇంటికి, 11 గంటలకు బోలో భారత్‌మాతాకీ జై అంటూ పార్టీ ఎలా అభివృద్ధి చెందుతుందని విజయేంద్రను ఉద్దేశించి అన్నారు. గాలి జనార్ధనరెడ్డి, శ్రీరాములు కలసి ఉండాలని గొడవలు సరికాదన్నారు. విజయేంద్ర మార్పుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు.

క్రైం కార్నర్

వేధింపులకు మహిళ బలి


మీనాక్షి (ఫైల్)

యల్లనూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగవరం గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక మీనాక్షి (32) ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసగౌడ్ తెలిపారు. శింగవరం గ్రామానికి చెందిన మీనాక్షి ఇదే గ్రామానికి చెందిన జయప్రకాష్‌ను 14 ఏళ్ల కిందట ప్రేమించి వివాహం చేసుకుంది. ఇటీవల కొద్దిరోజుల నుంచి కుటుంబంలో కలహాలు మొదల య్యాయి. అనుమానంతోపాటు కట్నం తేవాలని భర్త, ఆడబిడ్డ భర్త శివశంకర్ తరచూ మీనాక్షిని వేధించేవారు. వీటిని తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంటిలో అందరూ నిద్రపోతున్న సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పొలాల్లో దొంగలు

● ఆదివారం రాత్రి వరుసగా కేబుల్‌వైర్‌ల చోరీ


జగదీష్ తోటలో కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లిన దృశ్యం

యాడికి, జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు గ్రామం వద్ద ఆదివారం రాత్రి పది మంది రైతుల బోరుబావులకు సంబంధించిన కేబుల్‌వైరు ఎత్తుకెళ్లారు. రాయలచెరువుకు చెందిన రైతులు జగదీష్, శ్రీనివాసులు, వాసుదేవ తెలిపిన మేరకు.. రాత్రి 7గంటల సమయంలో తోటల వద్దకు వెళ్లి నీటిపారకం చూసుకొని వచ్చామన్నారు. తోటల వద్దకు సోమవారం ఉదయం వెళ్లి చూస్తే బోరుబావుల వద్ద కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లినట్లు గమనించామని తెలిపారు. జగదీశ్‌కు చెందిన మూడుబోరుబావుల కేబుల్‌వైరు, శ్రీనివాసులుకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరు, వాసుదేవకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరును దుండగులు కత్తిరించుకు వెళ్లినట్లు తెలిపారు. సమీపంలోని మరికొందరు రైతుల బోరుబావుల కేబుల్‌వైర్లను కట్ చేసుకొని వెళ్లారని తెలిపారు. పోలీసులు కేబుల్‌వైర్ చోరీలను అరికట్టకపోతే రైతులు బోరుబావుల కిందపంటలు సాగుచేయడం కష్టమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ వర్గీయుడి దౌర్జన్యం

● ఆశా వర్కర్‌పై కట్టెతో దాడి
● చేయి విరగడంతో ఆస్పత్రిపాలు
● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు


తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి

ధర్మవరంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామంలో వైసీపీ వర్గీయుడు పెద్ద ఫక్కీరప్ప దౌర్జన్యానికి దిగాడు. సోమవారం ఆశావర్కర్ లక్ష్మీదేవిపై కట్టెతో దాడి చేయడంతో ఆమె చేయి విరిగి, తీవ్రంగా గాయపడింది. లక్ష్మీదేవి తన గొర్రెల దొడ్డిలో పని చేసుకుంటుండగా పెద్ద ఫక్కీరప్ప అక్కడికి వెళ్లి దుర్భాషలాడాడు. ఎందుకు తిడుతున్నావని అడగ్గా.. కట్టెతో దాడిచేశాడు. తలపై కట్టెతో కొడుతుండడంతో ఆమె చేయి అడ్డం పెట్టింది. దీంతో చేయి విరిగింది. అడ్డువచ్చిన లక్ష్మీదేవి కుమార్తె, 3 నెలల బాలింత అయిన శశిపై దాడి చేశాడు. గాయపడిన లక్ష్మీదేవి, ఆమె కుమార్తె శశిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్ద ఫక్కీరప్ప గతంలో కూడా గొర్రెల మేపు విషయంలో తమపై దాడికి వచ్చాడనీ, అప్పట్నుంచి తాము కనిపిస్తే బూతులు తిడుతూ దాడికి యత్నిస్తుండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. పెద్దఫక్కీరప్ప తరచూ గ్రామస్థులపై దాడి చేస్తున్నాడనీ, మహిళలు అని కూడా చూడకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాడనీ, తనకు వైసీపీ నాయకుల అండ ఉందంటూ భయభ్రాంతులకు లోను చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఎస్ఐ బాబు సస్పెన్షన్

గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లిలో దళితుడిపై దాడి వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్ఐ బాబును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలికను వెంట తీసుకెళ్లాడని దళితుడు ఆంజనేయులును ఈనెల 21న నార్సింపల్లిలో విద్యుత్ స్తంభానికి కట్టేసి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు ఆంజనేయులుపై పోక్సో కేసు కట్టారు. ఈ నేపథ్యంలో మూడురోజుల క్రితం ఎస్పీ నార్సింపల్లికి చెందిన రెండు కుటుంబాల వారిని విచారించారు. ఘటనను సీరియస్‌గా తీసుకోవడంతో బాలిక బంధువులు ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వెంకటశివారెడ్డిని అరెస్టు చేశారు. ఆంజనేయులుపై దాడి అనంతరం పోలీసు స్టేషన్‌లో విచారణ సమయంలోనూ, కేసు నమోదు విషయంలో ఎస్ఐ బాబు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్పీ విచారణలో తేలింది. దీంతో ఎస్ఐపై చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

రైల్వే డివిజన్‌కు మూడు అవార్డులు

గుంతకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిబద్ధత చూపిన ముగ్గురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డుల లభించాయి. జోనల్ కేంద్రంలోని రైల్ నిలయంలో వివిధ రైల్వే డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. గుంతకల్లు, హైదరాబాద్ డివిజన్లలో ముగ్గురు ఉద్యోగులు చెప్పున, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, సికింద్రాబాద్ డివిజన్‌లో ఒకరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. విధుల్లో అప్రమత్తత, ఆపత్కాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, తదితర అంశాలు ప్రాతిపదికగా ఈ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్టు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ వెల్లడించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కల్లు గీత ఉపకులాలకు కేటాయించిన 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లోగానీ, హైబ్రిడ్ పద్ధతిలోగానీ వచ్చేనెల 5వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7న లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఆయా కల్లుగీత ఉప కులాలకు చెందిన అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సాహితీ స్రష్ట.. మాడుగుల

వరించి వచ్చిన పద్మశ్రీ పురస్కారం
కడవకల్లులో గ్రామస్థుల హర్షం


మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో మాడుగుల నాగఫణిశర్మ


మాడుగుల నాగఫణిశర్మ

పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అపారమైన పాండిత్యంతో అవధానాలలో మేటిగా నిలుస్తూ ప్రశంసలు పొందుతున్నారు మండలానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మ. ఈయన వందల కొద్ది అష్టావధానాలు చేసి, శతావధాని, సహస్రఫణి, బృహత్ ద్వి సహస్రావధానిగా కీర్తి గడించారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని కడవకల్లు గ్రామం. 1959 జూన్ 8న నాగభూషణశర్మ, సుశీలమ్మ దంపతులకు రెండో సంతానంగా మాడుగుల నాగఫణి శర్మ జన్మించారు. ఈయన పదో తరగతి వరకు కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడపజిల్లా ప్రొద్దుటూరులో విద్యాభ్యాసం సాగింది. తర్వాత సాహిత్యశిరోమణి పట్టా కోసం తిరుపతి వెళ్లారు. అక్కడ కపిలతీర్థం వీధుల్లో ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రాచ్య కళాశాల ఆయనలోని అక్షరదీప్తిని జాగృతం చేసింది. అక్కడ ఉపన్యాసం చేయడం మొదలు పెట్టా రు. అనంతరం మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఢిల్లీలో రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శిక్షాశాస్త్రి, తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1985-1990 మధ్యకాలంలో కడప రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకుడిగా పనిచేశారు. 1990నుంచి 1992మధ్య కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మప్రచార పరిషత్తు అడిషనల్ కార్యదర్శిగా కూడా నాగఫణిశర్మ పనిచేశారు. ఈయన ప్రతిభను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. దీంతో ఆయన స్వగ్రామమైన కడవకల్లులో హర్షాతీరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పాండిత్యానికి ప్రశంసలు

మాడుగుల నాగఫణిశర్మ తన సాహిత్య ప్రతిభతో మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ, మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి సమక్షంలో అవధానం నిర్వహించి ప్రశంసలు అందుకున్నాడు. ఈయన ప్రతిభకు అప్పట్లోనే శతావధానిసామ్రాట్, శతావధాన చూడామణి, కళాసాహిత్య కల్పద్రుమ వంటి ఎన్నో బిరుదులు వచ్చాయి. పలుచోట్ల పలువురు అభిమానులు కనకాభిషేకాలు, స్వర్ణశారదా ముద్రిక, ముత్యాలజల్లు, ఆందోళికాభోగం, స్వర్ణకంకణం, గండపెండేరం వంటివి చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనకు జ్యోతిష్యశాస్త్రంలో కూడా మంచి ప్రావీణ్యం ఉండటం గమనార్హం.



చాలా ఆనందంగా ఉంది

మా గ్రామంలో పుట్టి పెరిగిన మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కడం చాలా సంతోషం కలిగిస్తోంది. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇవ్వడం మా గ్రామానికే గర్వకారణం. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఎంచుకున్న రంగాలలో రాణించేందుకు ప్రయత్నించాలి.

- రామాంజనేయులు, కడవకల్లు

గ్రామానికి గుర్తింపు

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో మా గ్రామానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. నాగఫణి శర్మ అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చేవారని మా నాన్న చెప్పేవారు. ఆయన ప్రతిభ గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం హర్షించదగ్గ విషయం. అంత గొప్ప పండితుడు మా ఊర్లో పుట్టడం గర్వంగా ఉంది.

- నాగేశ్వర్‌రెడ్డి, కడవకల్లు



జాగ్రత్తగా పని చేయండి

● హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం
● ఎమ్మెల్యే పరిటాల సునీత


బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. ప్రతి విద్యార్థిని తమ సొంతబిడ్డలా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్‌లదేనన్నారు. చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర, ఎస్సీబాలికల హాస్టళ్లను సోమవారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో గణతంత్ర దినోత్సవం రోజున మధ్యాహ్నం భోజనం లేక విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడిన సంఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజనం బాగుందా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని, తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హాస్టల్‌లోని ప్రతి గదితో పాటు భోజన నాణ్యతను పరిశీలించారు. తర్వాత ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ హాస్టల్ భవనం దెబ్బ తిందని, మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని రూ.40లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని, మరోసారి కూడా తీసుకెళ్తామని తెలిపారు. హాస్టల్‌లో తాత్కాలిక మరమతుల కోసం కలెక్టర్ రూ.10లక్షలు మంజూరు చేస్తామని తెలిపారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నా రు. ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.33.80లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.32.40 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ నరసింహమూర్తి, వార్డెన్‌లు నరసింహమూర్తి, శ్యామల, టీడీపీ మండల కన్వీనర్‌ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, అంకేఅమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పగలే గొలుసు చోరీకి యత్నం

● ప్రతిఘటించిన మహిళ


చోరీ విషయాన్ని వివరిస్తున్న భార్గవి

ఓబుళదేవరచెరువు, జనవరి27(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో రెయిన్ బో పాఠశాల వద్ద భారత్ కూల్‌డ్రింక్స్ దుకాణంలో సోమవారం పగలే గొలుసు చోరీకి దుండగులు యత్నించారు. బాధితురాలు ప్రతిఘటించడంతో దొరికినకాడికి దోచుకెళ్లారు. మండల కేంద్రానికి చెందిన భార్గవి రెయిన్‌బో పాఠశాల వద్ద కూల్‌డ్రింక్స్ చిల్లర దుకాణం నడుపుతోంది. ఆమె భర్త వెంకటరామిరెడ్డి పనినిమిత్తం పొరుగూరు వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉన్న విషయానిన గుర్తించిన దుండగులు ఇద్దరు బైక్‌పై అక్కడికెళ్లారు. ఒకరు దుకాణంలోకి వెళ్లి రూ.20 ఇచ్చి అర లీటరు వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. మిగిలిన రూ.పది చిల్లర ఇచ్చేందుకు ఆమె డబ్బు పెట్టెను తీస్తుండగా ఆమె మెడలోని మంగళసూత్రంచైన్‌ను లాగాడు. భార్గవి రెండు చేతులతో చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేసింది. చైన్ తెగిపోవడంతో అందులో కొంతభాగాన్ని దుండగుడు తీసుకుని, అప్పటికే ఆన్‌చేసి ఉన్న ద్విచక్రవాహనం ఎక్కి ఉడాయించారు. అంతటితో ఆగని బాధితురాలు.. చైన్‌స్నాచర్‌పై కత్తి విసిరింది. అయినా వారు ఉడాయించారు. చుట్టుపక్కలవారు 100కి ఫోన్ చేయడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. చైన్ స్నాచర్స్ కోసం వెతగ్గా.. వారు దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విచారిస్తున్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన పన్ను వసూళ్లకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. గడువులోపు పన్నులు వసూలు చేయకపోతే ఇబ్బందులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లకు సంబంధించి గడువు లోపు టార్గెట్‌లు పూర్తి చేయాలని హెచ్చరిస్తున్నా, కొంత మంది సిబ్బందిలో ఏమాత్రం చలనం లేదన్నారు. ఇప్పటికే పన్ను వసూళ్లలో వెనుకబడిన వారికి సంబంధించిన జాబితా సిద్ధం చేశామని, అందుకు అనుగుణంగా తరచూ సమీక్షిస్తామన్నారు. గడువులోపు పంచాయతీలకు రావాల్సిన పన్నులు, నాన్‌ట్యాక్సులకు సంబంధించి వంద శాతం రాబట్టాల్సిందేనని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదలచేసినట్లు సోమవారం ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. తన కార్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళితో కలిసి ఆమె ఫలితాలను విడుదలచేసి మాట్లాడారు. డిసెంబరులో డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీఏ 62, బీకామ్ 57, బీఎస్సీ 60, బీబీఏ 48 శాతం చొప్పున విద్యార్థులు పాస్ అయ్యారని వివరించారు. మొదటి సెమిస్టర్‌తోపాటు తృతీయ, ఐదో సెమిస్టర్ రివాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 4లోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామకృష్ణ, అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అనర్హుల్లో ఆందోళన..!

● పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిన ప్రభుత్వం
● అనంతపురం, గుంతకల్లు ఆస్పత్రులలో దివ్యాంగుల పరిశీలన


ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పెన్షన్ వెరిఫికేషన్‌కు హాజరైన దివ్యాంగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల వెరిఫికేషన్‌తో అనర్హుల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వంలో ఎడాపెడా సర్టిఫికెట్లు పొంది పలువురు అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏరివేత ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారి ఇంటింటి వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇలాంటివారిని 2499మందిని గుర్తించగా, 1178మంది వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు. మిగిలిన వారివి పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దివ్యాంగుల పింఛన్లను కూడా పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రూ.ఆరు వేలు పింఛన్ పొందుతున్న 45,820మంది పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు. ఇందుకు జిల్లా కేంద్రం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం రెండు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికిపైగా పింఛన్‌దారులు వెరిఫికేషన్‌కు హాజరుకావడంతో ఆయా ఆసుపత్రుల ప్రాంగణాలు కిటకిటలాడాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన 12మంది డాక్టర్ల బృందాలు, డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు పింఛన్‌దారుల పునఃపరిశీలన చేపట్టారు. ఇందులో 8 మంది బుద్ధిమాంద్యం డాక్టర్లు, ఇద్దరు ఈఎన్‌టీ డాక్టర్లు, ఇద్దరు సైక్రియాటిస్టులను ప్రభుత్వం నియమించింది. ప్రతి సోమ, మంగళ బుధవారాల్లో పునఃపరిశీలన చేయనున్నారు. అనంతరం డాక్టర్ల బృందాలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. 12మంది డాక్టర్లను ఆరు టీంలుగా ఏర్పాటు చేశారు. ప్రతి డాక్టర్ వారంలో మూడు రోజుల పాటు రోజుకు కనీసం 50 పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు.


ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్‌దారులను పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

జిల్లాలో వెరిఫికేషన్ చేయాల్సిన పింఛన్లు 45,820

జిల్లాలో 45,820మంది పింఛన్లు వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందులో ఆర్థోపెడిక్‌కు సంబంధించి 24,700మంది, అంధులు 5,124 మంది, చెవిటి, మూగ 6,705మంది, బుద్ధిమాంద్యం 5,102మంది, మానసిక రోగులు 1036మంది, ఇతర దివ్యాంగులు 3,153మంది ఉన్నారు.

1,178మందికి వెరిఫికేషన్ పూర్తి

జిల్లాలో మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల వెరిఫికేషన్ ప్రారంభించారు. మొత్తం 2499మందిని గుర్తించగా ఇప్పటి వరకు 1178మంది వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో 6టీంలు పింఛన్‌పరిశీలన ప్రారంభించారు. ఇందులో ఆర్థోపెడిక్ డాక్టర్, జనరల్ సర్జన్ డాక్టర్‌లతో ఆశావర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొంటున్నారు. ఆరువారాల్లో పూర్తి చేయాలని ఇప్పటికే డాక్టర్లకు ప్రభుత్వం సూచించింది. ఇళ్లవద్దకే వెళ్లి ప్రత్యేకంగా నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

పురస్కారం సిగ్గుపడేలా..!



పురస్కార ధ్రువపత్రం.. ఇన్‌సెట్‌లో వార్డెన్ నారాయణ స్వామి

చెన్నేకొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పస్తులుంచి.. సస్పెండైన చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ నారాయణ స్వామి.. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలలో 'ఉత్తమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్'గా పురస్కారం అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో గణతంత్ర పురస్కారాలను అందుకు అతితక్కువ మంది వార్డెన్‌లలో నారాయణస్వామి ఒకరు. ఆదివారం ఉదయం పురస్కారం అందుకున్న ఆయన.. సాయంత్రానికి సస్పెండ్ అయ్యారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందలేదని తెలిసి హాస్టల్‌కు వెళ్లిన ఆర్డీఓకు స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు. విధి నిర్వహణలో వార్డెన్ నిర్లక్ష్యంగా ఉంటారని, మద్యం సేవించి వస్తారని వివరించారు. పురస్కారాల జాబితాలో చేర్చే సమయంలో కనీస వివరాలు సేకరించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎవరికిపడితే వారికి..

ప్రజలకు మెరుగైన సేవలు అందించేవారు, నిజాయితీగల అ ధికారులను గౌరవించేందుకు గణతంత్ర వేడుకలలో ప్ర భుత్వం పురస్కారాలను అందజేస్తుంది. కానీ పురస్కారాల ఎంపిక ప్రక్రియ ప్రహసనంగా మారుతోంది. నీతి, నిజాయితీతో సంబంధం లేదు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి అవసరం లేదు. సిఫార్సు ఉంటే చాలు.. జాబితాలో చేరిపోవచ్చు. ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చిన జాబితాను గుడ్డిగా ఆమోదిస్తున్నారు. పద్ధతిగా పనిచేసే అధికారులు, ఉద్యోగులను వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. కానీ గణతంత్ర వేడుకలలో పురస్కారాలు అందుకునేవారు వందల్లో ఉంటున్నారు. నిజాయితీగా పనిచేసి పురస్కారం దక్కించుకున్నవా రు. తమతోఎటుఉ అసమర్థులు, అవినీతిపరులు కూడా పురస్కారం అందుకోవడాన్ని జీర్ణించుకోలేకున్నారు. ఇలా ఎవరికిపడితే వారికి పురస్కారాలు అందించే ఆలోచన ఉంటే.. తమలాంటివారికి ఇవ్వకపోతేనే మంచిదని అంటున్నారు. 'మరకల' సరసన నిలబడేందుకు అసౌకర్యంగా ఉందని అంటున్నారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠం గా రూ. 9వేలు, సరాసరి రూ. 10వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపా రు. మార్కెట్‌కు మొత్తం 12 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అటవి విస్తీర్ణానికి రూ.100 కోట్లతో ప్రణాళిక

●అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె

రాయచూరు జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అటవి సంపదన పరిరక్షించడంతో పాటు అరణ్య విస్తీర్ణం పెంచేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు అటవి శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె తెలిపారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మీడియాలతో కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రంలో 16 జిల్లాలో అటవి ప్రాంతమే లేనట్లు గుర్తించిన నేపథ్యంలో చెట్ల పెంపకానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతో పాటు అటవి విస్తీర్ణం తగ్గకుండా తగిన జాగ్రతలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతకొన్నేళ్లుగా అటవి ప్రాంతాన్ని ధ్వంసం చేస్తు రైతులు భూములు సాగు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం చేయకుండానే అటవి విస్తీర్ణం పెంపుకు తమ ప్రభుత్వం తగిన కార్యచరణ చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సైద్ధాంతిక నిభద్దతతో నాయకత్వంలోనే పని చేస్తామని వేరే పార్టీ వాళ్లు తమ పార్టీలోకి చేరేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. పార్టీ సిద్ధాంతాలను ఆచరించేందుకు సిద్ధపడిన ఎవరినైన తాము ఆహ్వానిస్తామన్నారు. ఈ విషయంలో మాజీ మంత్రి శ్రీరాములు సహ ఎవరు పార్టీలోకి వచ్చినా తమకేమి అభ్యంతరం లేదన్నారు. ముఖ్యమంత్రి సతిమణికి ఈడీ నోటీసులు రావడం కేవలం రాజకీయ దురుద్దేశంతో కూడినవేనన్నారు. నివేశన స్థళాల అంశానికి సంబంధించి ఇప్పటికే లోకాయుక్త విచారణలో ఆమె నిర్దోశిగానే వెలువరించినా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈడీ నోటీసులు జారీ చేసిందన్నారు. బీజేపీ ఏతర ముఖ్యమంత్రులను వేదించడమే ఈడీకి పనిగా ఉందని ఎద్దేవా చేశారు. కాగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి, పీసీసీ అధ్యక్ష పదవి ఖాళీగా లేవని వాటి గురించి మాట్లాడాల్సిన పనే లేదన్నారు. పార్టీ జాతీయ నాయత్వం తీసుకునే నిర్ణయానికి నాయకులందరు కట్టుబడి ఉంటారని మంత్రి ఈశ్వర ఖండ్రె అన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్ ఖండ్రే

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

లాలా లజపతి రాయ్ (జయంతి)



'పంజాబ్ కేసరి'గా పేరొందిన లాలా లజపతి రాయ్ 1865 జనవరి 28న ఫిరోజ్‌పూర్‌లో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్రయమైన లాల్, బాల్, పాల్‌లో తొలి వ్యక్తి. పంజాబ్ నేషనల్ బ్యాంక్, లక్ష్మీ ఇన్సూరెన్స్ సంస్థల సంస్థాపకులు. కాంగ్రెస్ పార్టీ, ఆర్య సమాజ్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. పలు రచనలు, వ్యాసాలు రాసి ప్రజలలో చైతన్యం తెచ్చారు. సైమన్ కమిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించి పోరాడి గాయపడి చివరకు 1928 నవంబరు 17న కన్నుమూశారు.

గిడుగు వెంకటసీతాపతి (జయంతి)



ప్రసిద్ధ భాషా పరిశోధకుడు, 'కళాప్రపూర్ణ' గ్రహీత గిడుగు వెంకట సీతాపతి 1885 జనవరి 28న విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో తెలుగు వ్యవహారిక భాషోద్యమ సారథి గిడుగు వెంకట రామమూర్తి దంపతులకు జన్మించారు. 'విజ్ఞాన సర్వస్వ' నిర్మాత. ఆంధ్ర సర్వస్వమునకు అనేక వ్యాసాలు రచించి విశేషంగా తోడ్పడ్డారు. కేంద్రసాహిత్య అకాడమీ అభ్యర్థన మేరకు తెలుగు సాహిత్య చరిత్రను ఆంగ్లంలోకి అనువదించారు. వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ అకాడమీ 'డి లిట్' గౌరవంతో సత్కరించింది. 1969 ఏప్రిల్ 19న పరమపదించారు.

పండిట్ జస్‌రాజ్ (జయంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత పండిట్ జస్‌రాజ్ 1930 జనవరి 28న హర్యానా రాష్ట్రం ఫతేహాబాద్‌లో (అప్పట్లో పంజాబ్ ప్రాంతం) జన్మించారు. హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం, మేవాతి ఘరానాకు చెందిన భారతీయ శాస్త్రీయ సంగీత గాయకుడు. ఒక ప్రత్యేక వినూత్న పద్ధతిని జుగల్‌బందీలో ప్రవేశపెట్టారు. పురాతన మూర్ఛనలపై ఆధారపడిన శైలిలో గాయని, గాయకుడు తమ వేర్వేరు రాగాలను ఒకేసారి ఆలపిస్తారు. 'స్కూల్స్ ఫర్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్‌'ను ఏర్పాటు చేసి ఎంతోమందికి సంగీతం నేర్పించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత కళారత్న, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. 2020 ఆగస్టు 17న కన్నుమూశారు.

డబ్ల్యుబీ ఈట్స్ (వర్ధంతి)



విలియన్ బట్లర్ ఈట్స్ 1865 జూన్ 13న ఐర్లండ్‌లో జన్మించారు. కవి, నాటక, వ్యాస రచయితగా 20వ శతాబ్ధంలో సాహిత్యంలో తనదైన ప్రత్యేకతను గుర్తింపు పొందారు. ఐరిష్ దేశంలో సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేశారు. అబ్బే థియేటర్ స్థాపనకు పాటుపడ్డారు. ఐరిష్ ఫ్రీ స్టేట్‌కు రెండు సార్లు సెనేటర్‌గా వ్యవహరించారు. సాహితీసేవల కృషికి 'నోబెల్ పురస్కారం' అందుకున్నారు. 1939 జనవరి 28న కన్నుమూశారు.

సోలార్ పార్కులో బ్లాస్టింగ్.. ఒకరి మృతి

పావగడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా పావగడ తాలూకా తిరుమణి ప్రాంతంలో జేఎస్‌డబ్ల్యూ అనే కంపెనీ సోలార్ పార్కు కోసం బండను పేలుస్తుండగా ఓ వ్యక్తి చనిపోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బండను పేల్చే క్రమంలో రాయచూరు ప్రాంతానికి చెందిన బసవరాజప్ప (45) మృతి చెందగా.. పావగడ తాలూకా అచ్చంపల్లికి చెందిన శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కేఎస్‌పీటీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్, తిరుమణి రూరల్ సీఐ గిరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. 1002 ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్న సోలార్ పార్కులో ఎలాంటి ముందు జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఈ బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల కొండలు, గుట్టలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సామూహిక వివాహాల్లో ఒక్కటైన 156 జంటలు

▸▸ ఘనంగా సుత్తూరు జాతర - పలువురు స్వామిజీల భాగస్వామ్యం

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మైసూరులోని సుత్తూరు మఠంలో శివరాత్రీశ్వర శివయోగి జాతర మహోత్సవం మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగుతున్నాయి. సోమవారం 156 జంటలకు ఒకే ముహూర్తంలో కల్యాణం జరిపించారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి, ఎంపీ యదువీర్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. గదగ్ వీరేశ్వర పుణ్యాశ్రమం మఠాధిపతి కల్లయ్య జ్జనవర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీలతోపాటు పలువురు స్వామిజీలు పాల్గొన్నారు. జాతరకు వేలాదిమంది తరలిరాగా అందరికీ భోజనసదుపాయం కల్పించారు. ఈనెల 31వరకు జాతర కొనసాగనుంది. ఏటా జాతరలో సామూహిక వివాహాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని మఠాధిపతి తెలిపారు. వేలాదిమంది వచ్చిన భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



జాతర ప్రారంభంలో శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ తదితరులు

సాహిత్యంలో శిశునాళ షరీఫ్ సేవలు అపారం

దొమ్మసంద్ర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యంలో శిశునాళ షరీఫ్ సేవలు అపారమని సీనియర్ పాత్రికేయుడు విజయకుమార్ అభిప్రాయపడ్డారు. చందాపుర పురసభ పరిధిలోని కీర్తి లే అవుట్‌లో చిన్మయ సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే ఇంటింటా సాహిత్యసౌరభం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శిశునాళ షరీఫ్ రెండు శతాబ్దాలక్రితం హావేరి జిల్లా శిగ్గావి ప్రాంతంలో ఇస్లాం మతంలో జన్మించినా శివుడి ఆరాధకులుగా హిందూ, ఇస్లాం బోధనలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. మసీదు, మందిరాలను సందర్శించడం ద్వారా ప్రజలమధ్య సత్సంబంధాలు పెంచేందుకు కృషి చేశారన్నారు. తనదైన శైలిలో కన్నడ, ఉర్దూ, మరాఠిభాషల్లో అనేక భక్తిగీతాలు, తత్వపదాలు, అనుభవగీతాలు రచించారని అవినేటికీ మనుగడలో ఉన్నాయన్నారు. జ్ఞానిగా కవిగా సమాజం కోసం పాటుపడ్డారన్నారు. జాతీయ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నప్ప చిక్కహేగడె మాట్లాడుతూ నేటి యువత మొబైల్, కంప్యూటర్‌లకే పరిమితం అవుతున్నారని, సాహిత్య పుస్తకాలను చదివించేలా ప్రోత్సహించడమే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. చందాపురలోని గురుపంచాక్షరి పుట్టరాజు గవాయ్ సంగీతపాఠశాలకు చెందిన టీచర్ సిద్దలింగనగౌడ, సంగీత పాఠశాల విద్యార్థులు పాల్గొని పాటలు పాడి సభికులలో ఉత్సాహం తెచ్చారు. ప్రతిభావంత విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో చందాపుర పురసభ ఉపాధ్యక్షురాలు మంజుళమ్మ, చందాపుర పురసభ సభ్యురాలు జ్యోతి జగదీశాచారి, భారతి బసవరాజ్, రాష్ట్ర యువ పురస్కార గ్రహీత కే మహేశ్, సమాజసేవకుడు జగదీశాచారి, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



సాహిత్య సౌరభంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

పథకాల అమల్లో చిత్తశుద్ధి ఏదీ...?

బంగారపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమ కోసం కోట్లాది రూపాయలను బడ్జెట్‌లో ప్రకటిస్తున్నాయని అయితే వాటి అమలులో చిత్తశుద్ధి పాటించడం లేదని డీఎస్ఎస్ జిల్లా నాయకుడు హూవరసనహళ్ళి రాజప్ప ఆరోపించారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద డీఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన నిర్వహించారు. ప్రభుత్వ భూమిలో సాగు చేసేవారికి చట్టబద్ధంగా పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. చనిపోయినవారిని పూడ్చేందుకు కూడా చాలాచోట్ల స్మశానాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. తాలూకాలో భూమాఫియాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో అత్యాచారాలు, నేరాలు అధికమయ్యాయని, పేకాట, కోడిపందేలు, అక్రమ మద్యం వంటివి యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నా రని, మరికొన్ని చోట్ల లంచాలతో సరిపెడుతున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, సాంఘిక సంక్షేమశాఖ ఇతరశాఖల పథకాలు పూర్తిస్థాయిలు విద్యార్థులకు అందడం లేదన్నారు. ఇక వసతి పథకం మరుగున పడిందన్నారు. ఇలా పలు డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జిల్లా సమితి ముఖ్యులు హెచ్ మునివెంకటప్ప, సివి ముని నాగరాజు, తాలూకా సమితి ముఖ్యులు హిరేకరపనహళ్ళి రామప్ప తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

విద్య, ఆరోగ్య రంగాలకు సహకారం



ఓంశక్తి భక్తులతో రాజీవ్‌గౌడ

శిడ్లఘట్ట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తాలూకా ప్రజలకు ఉత్తమ విద్య, ఆరోగ్యం కోసం ఏబీడీ ట్రస్టు ద్వారా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ట్రస్టు ముఖ్యులు రాజీవ్‌గౌడ తెలిపారు. ఐఏఎస్, కేఏఎస్ సహా పలు పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ కేంద్రాన్ని ఫిబ్రవరి 20న ఏర్పాటు చేస్తామన్నారు. తాలూకాలోని 500మందికిపైగా ఓంశక్తి భక్తులకు బస్సు, భోజనం కల్పించినట్టు తెలిపారు. శిడ్లఘట్ట పట్టణంతోపాటు ప్రతి హోబళి కేంద్రంలో ట్రస్టు నుంచి అంబులెన్స్ వాహనాలు కల్పించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు అంబులెన్స్ సహకారి కానుందన్నారు. ఇప్పటివరకు 4వేలమందికిపైగా చేయూత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అంతేకాక ప్రతిభావంత విద్యార్థుల ఉన్నత విద్యకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కోచిముల్ మాజీ అధ్యక్షుడు గుడియప్ప, నగరసభ మాజీ ఉపాధ్యక్షుడు అప్సర్‌పాష, ప్రముఖులు నాగనరసింహ, ముత్తూరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్ల పంపిణీ

బొమ్మనహళ్ళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హొంగసంద్రలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నవనిర్మాణ కట్టడ కార్మికుల కర్ణాటక స్టేట్ ఫెడరేషన్ సౌత్‌జోన్ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు హెచ్‌సి శ్యామణ్ణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నందున వారి సంక్షేమం కోసం సంఘం ద్వారా కిట్‌లు సమకూరుస్తున్నట్టు తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ పథకాలను అందచేసేందుకు తమ సంఘం కృషి చేస్తోందన్నారు. కార్మికులు సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. కార్మికులకు ఎలక్ట్రిక్, పెయింట్ కిట్‌లు ఇవ్వడంతోపాటు విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగు పంపిణీ చేశారు. తొలుత గణతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, దాసు, సోమణ్ణ, మంజునాథ్, విజయమ్మ, కేశవ తదితరులు పాల్గొన్నారు.



కిట్ల పంపిణీలో స్థానిక ప్రముఖులు

కేంద్ర ప్రతిపాదనతో రాజ్యాంగ మూలసిద్ధాంతాలకు భంగం

దొడ్డబళ్ళాపుర, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఒకే దేశం - ఒకే ఎన్నికలు అనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ మూలసిద్ధాంతాలకు భంగం కలిగినట్టేనని హైకోర్టు సీనియర్ న్యాయవాది, బీసీవర్గాల కమిషన్ మాజీ అధ్యక్షుడు హెచ్ కాంతరాజ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జాగృత భవన్‌లో ఏర్పాటైన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల మనస్సుల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోందన్నారు. ఏం చేపట్టినా రాజ్యాంగ పరిధిలో కొనసాగాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని అభిలషించారు. ప్రజల అభిప్రాయానికి విలువ ఇచ్చి ముందుకు సాగాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక నాలుగుసార్లు ఏకకాలంలో లోక్‌సభ, శాసనసభకు ఎన్నికలు జరిగాయన్నారు. అయితే దీన్ని దేశవ్యాప్తంగా పూర్తిగా అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చర్చాగోష్టిలో చంద్రతేజస్వి, సీపీఎం తాలూకా కార్యదర్శి రుద్రారాధ్య, కన్నడ పక్ష ప్రముఖుడు సంజీవనాయక్, కన్నడ జాగృత పరిషత్ కార్యదర్శి ఆంజనేయ, తాలూకా కార్యనిరత పాత్రికేయలసంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉప్పార్, గూళ్య హనుమణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ రంగం నిత్యనూతనం



ఫ్యాషన్‌షో ప్రారంభోత్సవంలో సుమ తదితరులు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్‌రంగం నిత్యనూతనం లాంటిదని ప్రముఖ కొరియోగ్రాఫర్ సుమ అభిప్రాయపడ్డారు. జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు కోరమంగల క్లబ్‌లో లీవ్ ఇన్ ది మూమెంట్ థీమ్‌తో ఫ్యాషన్‌షో నిర్వహించారు. వివిధ విభాగాలలో జరిగిన పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు రాణించారు. ఫ్యాషన్ షోలో వివిధ విభాగాలకు బహుమతులు ప్రకటించారు. బ్లాక్ మిర్రర్ విభాగంలో ఆశా పవిత్ర, గోకుల ప్రియ, నిత్యాలకు, ఇకిగై విభాగంలో అమూల్య, బిందుకృష్ణ, పూజా ఇరానాలకు, అర్బన్ బ్లూమ్ విభాగంలో నాగ్రుంపన, చార్వీ కేజే, ఫిర్దాస్ ఫాతిమా, ముజో విభాగంలో తక్కర్ హర్షితా బృందం, ట్రూంపెల్ ఓయిల్ విభాగంలో శశాంక్, భూమికా పటేల్‌లు, ఇమిటేటెడ్ ఆర్ట్‌లో ప్రేరణా బృందం, ది బౌండ్‌లెస్ స్కిరైస్‌లో త్రివేణి బృందం విజయం సాధించింది. జేడీ ఫ్యాషన్ టెక్నాలజీ ఫౌండర్ ట్రస్టీ నీలేశ్‌దలాల్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు ఫ్యాషన్‌షో నిర్వహించామన్నారు. డిగ్రీ, పీజీ, డిప్లమో కోర్సులు చేసినవారు ఫ్యాషన్‌షోలో పాల్గొన్నారన్నారు.

కురికాయోను టీజర్ విడుదల



ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌కు సన్మానం

మహదేవపుర, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కురికాయోను సినిమా టీజర్‌ను ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ విడుదల చేశారు. కేఆర్‌పుర సంతె ప్రాంతంలో ఏర్పాటైన కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. పలు కన్నడ సినిమాలలో విలన్‌గా నటించిన ఓం మహేశ్ ఇదే తొలిసారిగా హీరోతోపాటు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. టీజర్ విడుదల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అయ్యప్పనగర్ ప్రాంత వాసి హీరోగా నటిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కన్నడ సినిమాలలో కొత్తవారికి అవకాశం కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించారు. ఓం మహేశ్ మాట్లాడుతూ తారా, రంగాయన రఘు, కరిసుబ్బయ్య తదితరులు నటిస్తున్నారన్నారు. టీజర్ విడుదలలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మునేగౌడ, మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్, ఆంటోనీస్వామి, లక్ష్మణ్, మంజునాథ్, దేవసంద్ర శ్రీనివాస్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

లాన్ ఎక్సెస్‌కు గ్లోబల్‌లో నాలుగో ర్యాంకు

బెంగళూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రసాయనాల రంగాల ఉత్పత్తులలో రాణిస్తున్న లాన్‌ఎక్సెస్ సంస్థ గ్లోబల్‌స్థాయిలో నాల్గోర్యాంకు సాధించినట్టు కంపెనీ ప్రతినిధులు సోమవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. లాన్‌ఎక్సెస్ డోజోన్స్ సుస్థిర గణాంకంలో సుదీర్ఘకాలం మన్నికలో వంద పాయింట్లకు 79 పాయింట్లు సాధించినట్టు ప్రకటించారు. వెదర్ టెక్నాలజీ, జల, కార్పొరేట్ పాలసీ, హ్యూమన్ రైట్స్, స్టీవార్డ్‌షిప్ విభాగాలలో నిర్దిష్టమైన గణాంకాలు సాధించినట్టు ప్రకటించారు.

లైన్ క్లియర్..!

- పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్
- 3న ప్రక్రియ
- టీడీపీ వశమైనట్లేనా?

హిందూపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఆరు నెలలుగా ఊరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పీఠం తెలుగుదేశం పార్టీ వశం కానుంది. దీంతో టీడీపీ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా డీఈ రమేష్ పేరు ఇప్పటికే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఖరారు చేశారు. ఇక ఎన్నిక లాంఛనమని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

హిందూపురం మున్సిపల్ ఎన్నికలు 2021లో నిర్వహించారు. మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా.. ఇందులో అప్పుడు వైసీపీ 29 స్థానాలను కైవసం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ 6, బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కో స్థానంలో గెలిచారు. అప్పట్లో 19వ వార్డు నుంచి గెలుపొందిన వైసీపీ కౌన్సిలర్ ఇంద్రజను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో..

వైసీపీ తరఫున చైర్‌పర్సన్‌గా ఇంద్రజ మూడున్నరేళ్లు కొనసాగారు. ఆమె అప్పట్లో వైసీపీ ఇన్‌చార్జి మహ్మద్ ఇక్బాల్ వర్గం కావడంతో చైర్మన్ పదవికి ఇబ్బందిలేకుండా సాగింది. వైసీపీ ఇన్‌చార్జి నుంచి ఆయనను తొలగించి, దీపికకు బాధ్యతలు అప్పగించడంతో మున్సిపల్ చైర్మన్ వర్సెస్ వైసీపీ ఇన్‌చార్జిగా పోరు సాగింది. దీంతో చైర్‌పర్సన్.. ఇన్‌చార్జి వర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ తరుణంలో గతేడాది నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంఐఎం, వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతేడాది ఆగస్టులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు, ఎనిమిది మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ మరుసటిరోజే ఇంద్రజ తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది.

వైస్ చైర్మన్‌కు అవకాశం

గతేడాది ఆగస్టులో చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేయంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో మూడు నెలలు దాటిపోతున్నా చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాకపోవడంతో నవంబరులో ప్రస్తుతం రెండో వైస్ చైర్మన్‌గా ఉన్న బలరాంరెడ్డిని ఎంపిక చేసి ఎన్నికల సంఘం తాత్కాలిక చైర్మన్‌గా నియమించింది. దీంతో ఆయన మున్సిపల్ చైర్మన్‌గా నవంబరు ఆఖరి వారంలో ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరు 20న మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా బలరాంరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.

నోటిఫికేషన్ జారీ

రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో హిందూపురం చైర్మన్ ఎన్నిక కూడా ఉంది. చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈనెల 30న కౌన్సిలర్లకు సమావేశం ఏర్పాటు చేస్తామని నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. వచ్చేనెల 3న 11 గంటలకు హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. అనివార్య కారణాల వల్ల 3న వాయిదా పడితే మరుసటి రోజు అనగా ఫిబ్రవరి 4న చైర్మన్ ఎన్నికకు అవకాశం ఇస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.



లాంఛనమేనా?

2021లో వైసీపీ వశమైన హిందూపురం మున్సిపాలిటీ టీడీపీ వశం కావడం లాంఛనమేనని తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 20మంది కౌన్సిలర్లు అవసరం. తెలుగుదేశం పార్టీకి 22 మంది కౌన్సిలర్లతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు కూ డా ఉండటంతో సంఖ్యాబలం 24కు చేరింది. ఈ నేపథ్యంలో చై ర్మన్ సీటు తెలుగుదేశం పార్టీ వశమైనట్లేనన్న చర్చ సాగుతోం ది. చైర్‌పర్సన్‌పదవికి రాజీనామా చేసిన ఇంద్రజ వాల్మీకి సా మాజికవర్గానికి చెందిన వారు. తెలుగుదేశం పార్టీ కూడా అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయాలని నిర్ణయించింది. దీంతో 6వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా కొనసాగుతున్న డీ ఈ రమేష్ చైర్మన్ కావడానికి లైన్ క్లియర్ అయినట్లు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండు నెలల క్రితమే మున్సిపల్ చై ర్మన్ ఎన్నిక జరుగుతుందని భావించి టీడీపీ తరఫున గెలుపొందిన ఆరుగురు సభ్యులతోపాటు వైసీపీ నుంచి పార్టీలో చేరిన వారితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అప్పట్లో చైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో పదిరోజులపాటు ఇతర ప్రాంతాల్లో విహారయాత్రకు వెళ్లిన స భ్యులు తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో మరోసారి తెలుగుదేశం పార్టీ తరఫున సభ్యులు విహార కేంద్రానికి వెళ్లే అవసరం ఉంది. ఏది ఏమైనా ఆరు నెలలుగా ఎదురుచూస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు వచ్చేనెల 3న నిర్వహించనున్నారు.

కలెక్టరేట్‌లో కలకలం

- కిరోసిన్ పోసుకుని ఒకరు
- పురుగు మందు డబ్బాతో వృద్ధ దంపతులు..

పుట్టపర్తిటౌన్, జనవరి27(ఆంధ్రజ్యోతి): సమస్యపై అధికారులు పదేపదే ఫిర్యాదు చేస్తున్నా.. పరిష్కరించకపోవడంతో విసిగిపోయిన బాధితులు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. ఓ యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకుని, స్టేషన్‌కు తరలించారు. వృద్ధ దంపతులు పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చారు. తనిఖీ చేస్తున్న పోలీసులు గుర్తించి, అడ్డుకున్నారు. ఈ పరిణామాలతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలకలం రేగింది.

ఒంటిపై కిరోసిన్ పోసుకుని..

పరిగి మండలం గౌరవహళ్లి గ్రామానికి చెందిన సోముశేఖర్.. తల్లి గంగమ్మను వెంటబెట్టుకుని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చాడు. కార్యాలయం బయటే ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై సోముశేఖర్‌ను వారించి, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితి వివరించారు. బాధితులు మాట్లాడుతూ.. తమకు తెలియకుండా తమ భూమిని గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా రికార్డుల్లో ఎక్కించుకున్నారని, ఇందుకు స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణ చేసి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

పురుగు మందు డబ్బాతో..

ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లికి చెందిన పెద్దన్న, ఆయన భార్య తమ భూమిని బంధువులు కబ్జా చేశారని ఫిర్యాదు చే యడానికి కలెక్టరేట్‌కు వచ్చారు. కార్యాలయం బయట తనిఖీ చేస్తున్న పోలీసులకు వృద్ధ దంపతుల సంచిలో పురుగు మందు డబ్బా దొరికింది. తమకు న్యాయం చేయకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చామని వారు తెలిపారు. కలెక్టర్ వద్దకు పోలీసులు వారిని తీసుకెళ్లారు. వారి సమస్య విన్న కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

196 అర్జీలు..

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 196 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 67 అర్జీలు అం దాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1618.46	1,588.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.136	264
నీటి నిల్వ (టీఎంసీలు)	57.12	9.90

గాలి జనార్దన్‌రెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో అక్రమాలు..!

● ఈసీకి టపాల శ్యాం ప్రసాద్ ఫిర్యాదు

బళ్లారి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఎన్నికల అఫిడవిట్ సక్రమంగా ఇవ్వలేదని ఈ విషయం పై విచారించాలని సీబీఐ డైరెక్టర్‌కు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఈ నెల 23 న ఫిర్యాదు చేసినట్లు టపాల శ్యాం ప్రసాద్ అనే వ్యక్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం నగరంలో ఉంటున్న టపాల శ్యాం టపాల గణేష్ స్వయానా తమ్ముడు. 2024లో కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కొప్పళ జిల్లా గంగావతి నియోజక వర్గం నుంచి గాలి జనార్దన్‌రెడ్డి కేఆర్‌పీపీ(కల్యాణ రాజ్య ప్రగతి పక్ష) నుంచి పోటీ చేసి గెలిచారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో గాలి జనార్దన్‌రెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవిషయం అంతక ముందే స్టేట్ ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ)కి ఫిర్యాదు చేశామని, వారు పట్టించుకోక పోవడం అనుమానం కలిగించిందన్నారు. అందుకే కేంద్ర ఎన్నికల కమిషన్ తో పాటు సీబీఐ కు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారా బట్టీలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సారా, అరెస్ట్ అయిన నిందితురాలు

కంప్లి, జనవరి 27(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 12వ వార్డు షికారి వీధుల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా బట్టీలపై దాడి చేశారు. దాడుల్లో శంకరమ్మ ఇంట్లో నాలుగు లీటర్లకుపైగా దొరికింది. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ ఉష, యణిగేరి మాట్లాడుతూ.. గతంలో 12వ వార్డులో శిఖర వీధిలో నాటుసారా బట్టీలు చేస్తున్న వారి ఇళ్లలో సోదాలు చేసినట్లు తెలిపారు. కేసులు కూడా నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దాడుల్లో ఉష, హనుమనగౌడ పాటిల్, అనుదీప్, పూజ, రాఘవేంద్ర, శంకరప్ప సిబ్బంది ఉన్నారు.

మిరప రైతు కంట్లో కారం..!

● తగ్గిన ధరలతో నష్టాలపాలు
● తెగుళ్ల పేరుతో తక్కువ ధరకే వ్యాపారుల బేరం
● పెట్టుబడులు కూడా రావని అన్నదాత ఆవేదన



మిరపను ఆరబోస్తున్న కూలీలు

కంప్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మిరపరైతుకు కన్నీళ్లే మిగిలాయి. ఈ యేడాది ఖరీఫ్ పంటల్లో మొక్కజొన్న వరి, పత్తి, ప్రొద్దుతిరుగుడు తదితర పంటలతో పాటు మిరప, పత్తి వేసుకున్న రైతులకు గిట్టుబాటు ధర కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల్లో నష్టాలు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అసలే ధరలు తగ్గి నష్టపోయామని బాధ పెడుతుంటే, తెగుళ్ల పేరుతో వ్యాపారులు మరింత తక్కువకు బేరం అడుతున్నారు. దీంతో వారి కష్టాలు అంతా ఇంతా కాదు. కంప్లి, కురుగోడు తాలుకా పరిధిలోని దేవసముద్రం, మెట్రి, శ్రీరామ రంగాపురం, మారుతీ క్యాంపు, కలకంబ్ల, వడ్డట్టి, సిద్దమ్మనహళ్లి, తదితర గ్రామాల్లో మిరప రైతులు తెగుళ్ల కారణంగా భారీగా దిగుబడి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ధరలకు కూడా క్వింటాల్‌కు గతంలో రూ.25 వేలు పలికేది, ప్రస్తుతం రూ.10 వేలు నుంచి రూ.15 వేలు మాత్రమే వుంది. ఓ వైపు ధరలు లేకపోవడంతో, మరో వైపు తెగుళ్ల వల్ల దిగుబడి కూడా పూర్తిగా తగ్గడంతో రైతులకు నష్టాలే మిగిలాయని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి : గోవిందప్ప, రైతు నాయకుడు

ప్రభుత్వాలు రైతులను ఆదుకునే విషయంలో విఫలమయ్యాయని ఆగ్రహం రైతు సంఘం నాయకులు గోవిందప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలన్నారు. మిరప రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకుని నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు.



కుల గణన నివేదిక విడుదల చేయాలి

● ప్రజాసంఘాల డిమాండ్



ధర్నాలో ఏకలవ్య దళం, పలు సంఘాల నాయకులు

బళ్లారి సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా అధ్యయనం చేసి రూపొందించిన కుల గణన నివేదిక విడుదలలో జాప్యాన్ని ఖండిస్తూ కర్ణాటక ఏకలవ్య దళం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించింది. జిల్లా యంత్రాంగం ద్వారా ముఖ్యమంత్రులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా ఏకలవ్య దళం అధ్యక్షుడు బాదామి శివలింగ నాయక్ మాట్లాడుతూ దేశంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. సామాజిక అసమానత సహించరానిదన్నారు. ప్రభుత్వ కులాలు, జాతుల గురించి కచ్చితమైన సమాచారం తెలియకపోతే దళిత , అణగారిన, దోపిడీకి గురవుతున్న వర్గాలకు న్యాయం జరగదన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు శికామణినాయక్, మారెన్న, ఈశ్వరప్ప, జయరాం, తిమ్మప్ప, అద్దిగేరి రామన్న, కొర్లగుంది కేశవరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించకపోతే పోరాటం

సిరుగుప్ప, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శిరిగేరి గ్రామంలో సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని జేడీఎస్ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ పేర్కొన్నారు. సిరుగుప్ప తాలుకాలోని శిరిగేరి గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని చెరువులో నిండిన పూడికను తొలగించాలని 35 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని వారం రోజుల నుంచి గ్రామస్థులు నిరాహారదీక్ష చేస్తున్నారు. ఈ పోరాటానికి జేడీఎస్ తాలుకా అధ్యక్షులు శివ నారాయణ మద్దతు ప్రకటిస్తూ కనీసం తాగడానికి మంచినీరు, ఆరోగ్యంపై దృష్టిసారించకపోవడం ఏంటని ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. ప్రధాన అంశాలను కూడా పరిష్కరించక పోతే ప్రభుత్వ వ్యవస్థ విఫలమైనట్లు ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా జేడీఎస్ తాలుకా సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆందోళనకు మద్దతు తెలుపుతున్న జేడీఎస్ నాయకుడు శివనారాయణ

రేషన్ షాపులో పురుగుపట్టిన జొన్నలు

● నాసిరకంపై ప్రజల ఆగ్రహం
● అధికారులకు వ్యతిరేకంగా ఆందోళన



రేషన్ దుకాణం ముందు ఆందోళన చేస్తున్న ప్రజలు

గంగావతి రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణంలో పురుగు పట్టిన జొన్నలు పంపిణీ చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొప్పళ తాలూకా పరిధిలోని అళవండి గ్రామంలో చౌక ధాన్యం డిపోల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న జొన్నలు పురుగుపట్టి నాసిరకంగా ఉన్నాయి. గ్రామంలోని సిద్దేశ్వర మఠం వద్ద ఉన్న చౌక ధాన్యం డిపోలో పంపిణీ చేస్తున్న జొన్నలో చెత్తా చెదారంతో పాటు పురుగులు ఉన్నాయని, ఇలాంటి జొన్నలు ఆహారంగా తీసుకుంటే అనారోగ్యంపాలు కాక తప్పదని ప్రజలు డిపో యజమానులపై మండి పడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇలాంటి జొన్నలు సరఫరా చేస్తోందని తామేమీ చేయలేమని డీలర్లు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం బీపీఎల్ కార్డులకు అందజేస్తున్న రేషన్‌లో ఇలాంటి నాసిరకం జొన్నలు పంపిణీ చేయడం ఎంతవరకు న్యాయమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి జొన్నలు తింటే తాము అనారోగ్యం పాలైతే ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నాసిరకం జొన్నలు పంపిణీని వెంటనే నిలిపేసి, నాణ్యమైన సరుకులు అందజేయాలని అధికారులను కోరుతున్నారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

రాయచూరు జనవరి 27(ఆంధ్రజ్యోతి): భూమికి సంబంధించిన వివాదంలో జరిగిన ఘర్షణలో వ్యక్తి ఒకరు మృత్యువాతపడిన సంఘటన జిల్లాలోని దేవదుర్గ తాలూకా బోబనగుండ గ్రామ పరిధిలో వచ్చే కాలంగేర గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బసవరాజ్ తిమ్మయ్య (35) అనే వ్యక్తి మృత్యువాతపడగా ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జాలహళ్ళి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా మృతుడు బసవరాజ్ కుటుంబం ఉమ్మడిగా ఉన్నప్పుడు ఖరీదు చేసిన మూడెకరాల భూమి ఆయన చిన్నాన్న పేరు పై ఉండగా అతడు మృతి చెందిన అనంతరం ఆ భూమి ఆయన భార్య పై బదిలీ జరిగింది. అయితే ఆ భూమిలో తమకు కూడా వాట ఉంటుందన్న బసవరాజ్ వాదనతో ఘర్షణకు దారి తీయడంతో హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించి జాలహళ్ళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మిరప మార్కెట్ ఏర్పాటు చేయాలి

● 30న నిరసనకు తరలిరావాలని రైతు సంఘం పిలుపు



పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలో మిరప మార్కెట్‌ను నిర్మించాలని, పంటకు సరైన మద్దతు ధర ప్రకటించాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మిరప పంటకు మద్దతు ధర క్వింటాల్‌కు 5,531 25,000, బ్యాడిగ రకానికి 2043 పంటకు రూ.50వేలు అందించాలని అలానే బళ్లారిలో మార్కెట్‌ను కూడా నిర్మించాలని కోరారు. ఈసంవత్సరం రైతులు మిరప పంటను పండించడానికి ఎకరాకు లక్షన్నర నుంచి రెండు లక్షలు ఖర్చు చేశారని, గత నెల రోజులుగా కొన్ని రోజులుగా నిరంతర వర్షాల కారణంగా మిరపకాయలు మరింత పచ్చగా మారి బ్లాక్‌స్పాట్ వ్యాధి సోకిందన్నారు. మార్కెట్‌లో క్వింటాల్ మిరపకాయలను రూ.8000నుంచి రూ.11వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరతో రైతులకు నష్టాలు తప్పవన్నారు. నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో మిర్చి ధర బాగా పడిపోయిందున బళ్లారి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటకోసం తీసుకున్న అప్పుల భారాన్ని భరించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి నెలకొంది. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వమే మిర్చి మద్దతు ధరను నిర్ణయించి బళ్లారిలో మిర్చి మార్కెట్‌ను ప్రారంభించాలన్నారు. రాష్ట్రకమిటీసభ్యులు హనుమంతప్ప మాట్లాడుతూ జిల్లాలో 5తాలూకాల్లోని చాలా మంది రైతులు మిర్చి పంటను పండిస్తున్నారు. పండించిన మిర్చిపంటను అమ్మడానికి హావేరీ జిల్లా బ్యాడ్గికి వెళ్లాలని, ప్రయాణ ఖర్చులు భారం అవుతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర-కేంద్రప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని రైతుల మిర్చి పంటకు మద్దతు ధర అందించి న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఈనెల 30న భారీ స్థాయిలో నిరసన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బళ్లారిలో జరగనున్న ఈ నిరసనలో మిర్చి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈసందర్భంగా తాలూకా కార్యదర్శి ధనరాజ్, జిల్లా కమిటీ సభ్యుడు హొన్నూరప్ప, గురళ్ళిరాజ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామాకు డిమాండ్



నిరసన తెలుపుతున్న దళిత సంఘం సభ్యులు

బళ్లారిరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కర్ణాటక దళిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దళిత సంఘం నాయకులు కప్పగల్లు ఓంకారప్ప మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడినందువల్ల కేంద్ర మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కప్పగల్లు ఓంకారప్ప, నాగరాజు, సంగనకల్లు విజయ్‌కుమార్, లింగప్ప, హనుమంతు, వన్నూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంధపు చెక్కల స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, స్వాధీనం చేసుకున్న గంధపు చెక్కలు

కంప్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సండూరు తాలుకా రామన్న మలై అడవిలోని కొండల్లో ఇద్దరు గంధం చెట్లు నరుతున్న ఇద్దరిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుశీల్ నగర్‌కు చెందిన లచ్చనాయక్, ముత్యానాయక్‌అరెస్ట్ అయినవారు. గత కొన్ని రోజులుగా రామన్న మలై అడవుల్లో సిద్దరామేశ్వర దేవాలయం వెనుక భాగంలో గంధం చెట్లు తరలిస్తున్న విషయం అధికారులు గుర్తించారు. ఫారెస్టు అధికారులు అప్రమత్తమై సోమవారం అడవుల్లో నుంచి తీసుకెళుతున్న నాలుగు కిలోలకుపైగా వున్న గంధపు చెట్టుకొమ్మలను పట్టుకుని వారిని అరెస్టు చేశారు. అలాగే సుశీల్ నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. అడవుల్లోకి వెళ్లినా, గంధం చెట్లు నరికినా కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారి వెంకటేష్ హెచ్చరిచారు. ఇద్దరినీ అరెస్టుచేసి కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు



కమ్మ భవనంలో కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

సిరుగుప్ప, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సినీనటుడు నందమూరి బాలకృష్ణ నట సార్వభౌముడని అభిమాని గణేష్‌రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణం కమ్మవారి భవన్‌లో నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంతో అభిమానులు భారీఎత్తున సంబరాలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమాని గణేష్‌రావు మాట్లాడుతూ బాలకృష్ణ 50 యేళ్లపాటు సుదీర్ఘంగా ఎన్నో సాంఘీక, పౌరాణిక, రాజకీయ తదితర వాటిపై ఎన్నో అద్భుత చిత్రాల్లో ఉత్తమ నటన కనబరచి నటసార్వభౌముడిగా పేరు ప్రఖ్యాతలు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా అభిమానులు నర్రా మురళి, జాలాది రాధాకృష్ణ, శాంతకృష్ణ, రఘుకిరణ్, చౌదరి, సత్యానారాయణ, చెంచురామయ్యప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ సభ్యులపై అనర్హత వేటు

రాయచూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా ఉటకనూరు గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు సభ్యులను సస్పెండ్ చేస్తు పంచాయత్ రాజ్ శాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు, ప్రస్తుత సభ్యురాలు కావేరి మరో మాజీ అధ్యక్షురాలు ఈరమ్మ సభ్యత్వాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో పాటు వచ్చే ఆరేళ్లలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హురాలుగా వారిని ప్రకటిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం జరిగినట్లు సాక్షాలు లభించిన నేపధ్యంలో వారి పై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. రూ.16 లక్షల 96 వేల నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారుల విచారణలో వెల్లడైన నేపధ్యంలో ఆ ఇద్దరి పై సస్పెండ్ వేటు వేశారు.

హోసూరు జోన్

లారీ బోల్తా.. ఒకరి మృతి



బోల్తాపడిన లారీ

హోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ముల్లంగి లోడుతో వెళ్తున్న లారీ కెలమంగలం సమీపాన బోల్తా పడింది. కెలమంగలం సమీపాన కొత్తపల్లికి చెందిన డ్రైవర్ సతీశ్‌కు చెందిన వాహనం సరిహద్దులోని బొమ్మసంద్ర నుంచి ముల్లంగిలోడుతో వస్తుండగా కుక్క ఎదురుగా రావడంతో తప్పించే ప్రయత్నంలో లారీ అదుపు తప్పింది. ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాంబాబు (28) మృతి చెందగా గాయపడిన ముగ్గురిని హోసూరు ఆసుపత్రికి తరలించారు. కెలమంగలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డెంకణీకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుజరీ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

హోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చిన్నఎళసగిరి వద్ద పళని వ్యక్తికి చెందిన గుజరీ గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. పాత సిలిండర్లు, సామగ్రి టెంపోలో తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. చలి తీవ్రంగా ఉండడంతో ఆదివారం తెల్లవారుజామున స్థానికులు చలిమంట వేసుకున్నారు. ఇందులోని నిప్పురవ్వలు ఎగిరిపడి టెంపోపై పడి అగ్ని ప్రమాదం జరిగింది. టెంపోలోని వస్తువులన్నీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే కార్యాచరణ చేపట్టారు. అప్పటికే టెంపో సహా పలు వస్తువులన్నీ కాలిపోయాయి. మంటలు వ్యాపించకుండా నియంత్రించగలిగారు. సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.



కాలిపోయిన టెంపో, సామగ్రి



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం

హోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని 38వ వార్షిక రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణం జరిగింది. సోమవారం ఉదయం గణపతి హోమం, అష్టపది భజన, ధ్యానం, డోలోత్సవం జరిగాయి. భజనలు, నాట్య ప్రదర్శనలు సాగాయి. హోసూరు లోకక్షేమ భక్తమండలి ఆధ్వర్యంలో ప్రైవేట్ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమం శరణ్ మహాదేవి బాలవెంకటకృష్ణ భాగవతార్ బృందం గంటలతరబడి సాగింది. చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

ఆసుపత్రికి రూ.10 లక్షల సామగ్రి విరాళం

హోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు 10 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందచేసిన వారిని ఆసుపత్రి వైద్యులు సత్కరించారు. ప్రైవేట్ సంస్థలు, ఫ్యాక్టరీలు, ప్రైవేట్ ఆసుపత్రుల తరఫున సుమారు 10 లక్షల పరికరాలను సోమవారం అందచేశారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవలకు ప్రైవేట్ సంస్థలు సహకారం అందించడంపై హర్షం వ్యక్తంచేశారు. వైద్యులు భువన, జయపాల్, విజయన్ పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న వైద్యబృందం